నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 66



# నా సాహిత్యం నా జీవితమే!

**- వక్కంతం సూర్యనారాయణరావ్**

కథ రాసినా, నవల రాసినా, అపరాధ పరిశోధక నవల రాసినా ఆయన కోరేది సామాజిక శ్రేయస్సే! ఆయన రాసే తెలుగు భాషలో శక్తి ఉంటుంది. భావనలో అనురక్తి ఉంటుంది. దాదాపు ప్రతీ రచనలోనూ స్త్రీ పట్ల ఆయన సానుభూతి కొట్టొచ్చినట్టు కనిపిస్తూ వుంటుంది. అందుకేనేమో మనసుకవి ఆత్రేయ ఆయనకు 'మగ రచయిత్రి' అనే బిరుదు ఇచ్చారు. ఆయన 'చదివించే' నాటకాలు రాశారు. నేలమీద కాలు ఊనుకున్న కత్తివాదరలాంటి సంభాషణలు అందుకు కారణం. అంతస్సౌందర్యాన్ని ఆవిష్కరించే రచయితగా ఆయనకి గుర్తింపు వుంది. దాదాపుగా ముఖ్యమైన ప్రక్రియలన్నింటిలోనూ రచయితగా తన ప్రతిభను నిరూపించుకున్న వక్కంతం సూర్యనారాయణరావ్ గారితో ఇంటర్వ్యూ మీ కోసం...

## చిన్నవయసులో పెద్ద పాఠకుడు

వక్కంతం వరదయ్య, సుబ్బలక్ష్మమ్మ దంపతులకు 1942 డిసెంబరు 30న జన్మించాను. మొత్తం తొమ్మండు గురు సంతానంలో ఆరవవాణ్ణి. పురుష సంతతిలో రెండో వాణ్ణి. చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపంలోని అరికెల గ్రామం జన్మస్థలం. నాన్నగారి ఉద్యోగం కరణీకం. ఆయన సాహితీప్రియులు. రామాయణ, భారత, భాగవతాలు ఆయనకు కొట్టిన పిండి. సమకాలీన కాల్పనిక సాహిత్యాన్ని కూడా చదివేవారు. అపరాధక పరిశోధక సాహిత్యం అంటే ఆయనకి చాలా ఇష్టం.టెంపోరావ్ ఆయన అభి మాన రచయిత. అరికెల ప్రాథమిక పాఠశాలలో అయిదో తరగతి చదివేటప్పుడు నాచేత సాహిత్యం చదివించడాన్ని ప్రారంభించారు నాన్న. మొట్ట మొదట ఆయన నాకు చద వమని ఇచ్చిన పుస్తకం ఒక డిటెక్టివ్ నవల. పేరు 'ఇతన్ని నమ్మకండి'. రచయిత టెంపోరావ్. చక్కటి శుభ ముహు ర్తంలో నాన్న నన్ను పాఠకుడిగా చేశారు. ఆనాటి నుంచీ ఈనాటి వరకు చదువుతూనే ఉన్నాను; చదవకుండా ఉండ లేను. ఏడు మైళ్ళు నడిచి, పుంగనూరికి వెళ్ళి నాన్నకు డిటె క్టివ్ నవలలు తెచ్చేవాణ్ణి. ఇద్దరం చదివేవాళ్ళం. నాన్న నన్ను చిన్న వయసులోనే పెద్ద పాఠకుణ్ణి చేశారు.



## చదువు, సంధ్య

హైస్కూలు చదువు పుంగనూరులో సాగింది. స్కూల్ ఫైనల్‌తో చదువు ఆగి పోయింది. బాల్యం నుండీ తెలుగంటే తగని ప్రేమ నాకు. తెలుగు వాచకాల్లోని పద్య విభాగాన్నీ గద్యభాగాన్ని కంఠస్థం చేసేవాణ్ణి. అదో ఆనందం. తెలుగులో నాకు వచ్చినన్ని మార్కులు 'ఏ క్లాసులోనూ , ఎవ్వరికీ వచ్చేవి కావు. విద్యా ర్థిగా చదువు హైస్కూల్లో; సంధ్య గ్రంథాలయంలో. అక్కడి పుస్తకాలను కంఠ తంగా చదివాను. అదొక యాగంలా సాగింది. నాన్న పోయారు. స్కూల్ ఫైనల్ దాకా అన్న రామసుబ్బయ్య చదివించి, ఆపైన ఆపేశారు. ఆయన, కరణీకం లెక్కలు రాయించేవారు నాచేత. ఆ కార్యక్రమం రాత్రీ పగలూ విశ్రాంతి లేకుండా సాగేది. నాన్న చదవడం అలవాటు చేశారు. అన్న రాయడం అల వాటు చేశారు. ఆ రాయడం అనేది ఉత్తరోత్రా రచయితగా, నాకు ఎంతో ఉప యోగపడింది. చదువు ముగిశాక ఆంగ్ల సాహిత్యాన్ని విస్తృతంగా చదివాను.

## తొలి రచన

నాలోని పాఠకుడు రచయితగా ఎదిగాడు. నా జన్మస్థమైన పల్లెటూరిలో జరి గిన ఒక సంఘటన ఆధారంగా 'అబల ఆంతర్యం' అనే నవల రాశాను. అప్పుడు నా వయసు ఇరవై ఏళ్ళు. మద్రాసులో పబ్లిషర్‌కి పంపించాను. నాలుగేళ్ళ తర్వాత తెలిసింది నాకు,'అబల ఆంతర్యం' అచ్చయిందని. ఆ ప్రచురణ కర్త నాకు పుస్తక ప్రతులు పంపలేదు. పారితోషికం ఇవ్వలేదు. నవల ముద్రించినట్టు చెప్పలేదు. తర వాత ఎప్పుడో కలసి, నిలదీసినప్పుడు చెప్పాడు. బాగా అమ్ముడుపోయిందని!

## టెంపోరావ్‌తో పరిచయం


పల్లెటూళ్ళో కొంతకాలం వ్యవసాయం చేశాక, తపాలా శాఖలో గుమస్తాగా ఉద్యోగం వచ్చింది. కుప్పంలో ఉన్న సమయంలో (1967)నా అభిమాన రచ యిత టెంపోరావ్‌గార్ని మద్రాసులో కలుసుకున్నాను. ఆయనతో నా పరి చయం ప్రాణస్నేహంగా ఎదిగింది. ఆయన గురువూ నేను శిష్యుడు. ప్రతి నెల ఆయన్ని చూడ్డానికి మద్రాసు వెళ్ళేవాణ్ణి. టెంపోరావ్ గారి ద్వారా నాకు పాల గుమ్మి పద్మరాజు గార్నీ ధనికొండ హనుమంతరావుగార్ని కొమ్మూరి సాంబశివ రావు గార్ని కనకమేడల గార్ని తరచుగా కలుసుకునే అవకాశం లభించింది. 'బాస్వెల్ ఆఫ్ టెంపోరావ్' అనేవారు వాళ్ళందరూ నన్ను.

## కథకి అతిగొప్ప పారితోషికం లభించింది

మావూళ్ళో వ్యవసాయం సాగించే కాలంలో నాక ఒకమ్మాయితో పెళ్ళిచూపులు జరిగాయి.అమ్మాయి నాకు నచ్చింది. పెద్దలందరికీ నచ్చింది. అమ్మాయి వాళ్ళకి మా సంబంధం నచ్చింది. అయితే ఏదో సాకుతో వారు మూడు నెలల పాటు వాయిదా వేస్తూ వచ్చారు. రమ్మంటారు; వద్దంటారు. వస్తామంటారు, రారు! చివ రికి తెలిసిందేమిటంటే వ్యవసాయం చేస్తూ పల్లెటూళ్ళో ఉన్న నన్ను చేసుకోనంది ఆ అమ్మాయి. తపాలా శాఖలో ఉద్యోగం వదిలేసి, వ్యసాయంలో దిగినప్పుడు మా బావగారు చులకనగా మాట్లాడారు. 'ఏ పిల్లా నిన్ను చేసుకోదు' అన్నారు. ఆయన శాపనార్థాన్ని స్ఫూర్తిగా తీసుకుని 'అజ్ఞాన శాకుంతలమ్' అనే కథ రాశా ను.టెంపోరావ్‌గారు 'యవ్వనం' పత్రికలో ప్రచురించారు. ఆ కథలో నాయి కకూ, సేద్యం చేసే పల్లెటూరు వాణ్ణి చేసుకోను అన్న స్వర్ణకుమారికీ చాలా దగ్గరి పోలికలున్నాయి. ఆ కథని స్వర్ణకుమారికి పంపించాను. కథ నచ్చితే నన్ను చేసు కోమన్నాను, నచ్చకపోతే కథను త్రిప్పిపంపమన్నాను ఉత్తరంలో. కథ తిరిగి రాలేదు! స్వర్ణకుమారి నా అర్థాంగిగా వచ్చింది. మా పెళ్ళికి టెంపోరావ్ వచ్చారు. 'మేమంతా కథలురాసి డబ్బు సంపాదించాం. నువ్వు ఒక కథతో జీవి తభాగస్వామిని సంపాదించావు. యూ ఆర్ గ్రేట్! నీకథలో ప్రాణముంది!' అన్నారు. అర్థాంగిని మించిన అతిగొప్ప పారితోషికం ఏముంటుది రచయితకి?

## ఆచార్య ఆత్రేయ అభిమానం

తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగిగా ఉన్న కాలంలో నా రచనా వ్యాసంగం ఊపందుకుని, నిర్విరామంగా సాగింది. ఉద్యోగరీత్యా కన్నడ



శ్రీమతి స్వర్ణకుమారితో...

ధార్మిక సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించాను. అవి తి.తి.దే. ప్రచురణలుగా వచ్చాయి. వివిధ ఆడియో కంపెనీల కోసం వెయ్యికి పైగా భక్తిగీతాలు రాశాను. తిరుపతిలో ఆత్రేయగారితో పరిచయం కలిగింది. అచిరకాలంలోనే మనసు కవితో చక్కటి సాన్నిహిత్యం ఏర్పడింది. నా రచనలన్నీ ఆయన చదివారు. 'శివరామ్' పాత్రతో నేను రాసిన సస్పెన్స్ కథల్ని దూరదర్శన్‌కి సీరియల్‌గా తీయాలని ఆయన ఎంతో ప్రయత్నించారు. అయితే ఆయన ప్రయత్నించే సరికే ఆ కథలు తస్కరించబడి, సీరియల్‌గా దూరదర్శన్‌లో దర్శనమిచ్చాయి. 'విపుల'లో వచ్చిన నా కథ 'మోడల్' ఆత్రేయ గారి మనసు దోచుకుంది. శ్రీదేవి, కమలహాసన్ జంటగా చలనచిత్రంగా ఆ కథను నిర్మించాలని ఆయన అనుకున్నారు కూడా!

## ఆత్రేయ నమస్కారం

'మోడల్' కథని చదివిన వెంటనే ఆత్రేయ గారు మద్రాసు నుండీ తన శిష్యుడిని తిరుపతికి పంపించారు. ఆ శిష్యుడు ఎవరో కాదు. రచయిత భారవి. భారవి తన తరపున తిరుపతిలో రోడ్డు మీదే నాకు పాదాభివందనం చేశారు. రెండోసారి నమస్కరించి 'ఇది గురువు ఆత్రేయ నమస్కారం' అన్నారు. నా శరీరం జలదరించింది. వెంటనే మద్రాసు వెళ్ళిపోయాను. ఆత్రేయగారి పాదాల ముందు మోకరిల్లి, ఆనందబాష్పాలు రాల్చాను. 'మీరు నాకు నమస్కారం చేయడమా?'అన్నాను. 'మీకెవరు చేశారు? మీలోని సరస్వతికి చేశాం' అన్నారాయన. నా అదృష్టం ఏమిటంటే ఆత్రేయ గారు చాలా సందర్భాలలో నన్ను తమ అభిమాన రచయితగా పేర్కొన్నారు. నేను స్త్రీవాద రచనలే అధికంగా చేశాను. అన్నీ స్త్రీల పరంగానే రాస్తున్న నన్ను ఆత్రేయ గారు 'మగ రచయిత్రి'అన్నారు. ''మా మగవాళ్ళ గురించి కూడా రాయండి'' అనేవారాయన.

## నాకూ ఆడపిల్లలున్నారు

నిజ జీవితంలో నాకు కుమార్తెలు లేరు. ముగ్గురూ మగపిల్లలే! అయినా, నాకు ముగ్గురు కూతుళ్ళున్నట్టుగా గర్వంగా చెప్పుకుంటాను. వాళ్ళెవరంటే- 'మోడల్ ' కథలోని 'వినయ', 'న్యాయదుందుభి' నాటకంలోని 'నిరుపమ'; 'సంభవామి గృహేగృహే' నవలలోని 'సహజ' . ఈ ముగ్గురు నాయకలనీ నేనెప్పుడూ నా కుమార్తెలుగానే భావిస్తాను, ప్రేమిస్తాను.

## సాహిత్యాన్ని జీవితం నుండీ విడదీయలేను

నా జీవితంలో సాహిత్యం ఒక భాగం. దాన్ని నిజజీవితం నుండీ వేరుచేసి చూడ్డం నాకు చేతకాదు. ఆయా పాత్రలలో లీనమైపోయి రాయడం నా బలహీనత. పోటీ కోసం 'సంభవామి గృహేగృహే' నవల రాశాను. పోటీకి హైదరాబాద్ పంపించాలి. 'పోటీకి పంపను. నా కూతుర్ని ఎక్కడికీ పంపను' అంటూ పసిపిల్లాడిలా ఏడ్చాను. ఆ నవలలోని 'సహజ'పాత్రంటే నాకు ప్రాణం. మా పెద్దబ్బాయి వంశీ నాకు ధైర్యం చెప్పి, నవలను పోటీకి పంపించాడు. బహుమతి వచ్చింది. అది కూడా స్త్రీ ప్రాధాన్యత ఉన్న రచనే!

## నవగ్రహపురాణం

భారతీయ ధార్మిక వాఙ్మయంలో నవగ్రహాల గురించిన వివరాలు ఒకచోట క్రోడీకరించబడలేదు. అది ఒక లోటుగా అనిపించింది. చాలా కాలం పాటు పరిశోధన సాగించాను. 'నవగ్రహ పురాణం' పేరుతో రాశాను. 'నవ్య'లో ధారావాహికగా వచ్చింది. పాఠకులు ప్రశంసల వర్షం కురిపించారు. నా రచనలలో 'నవగ్రహపురాణం' పెద్దది.

## దృశ్యమాధ్యమాలు

కొన్ని చలన చిత్రాలకు సంభాషణలు రాసే అవకాశం లభించింది నాకు. ప్రముఖ దర్శకులు పి.ఎన్.రామచంద్రరావు గారు 'శుభవార్త' చిత్రానికి నాచేత సంభాషణలు రాయించారు. ఆయన దర్శకత్వం వహించిన 'భక్త మార్కండేయ' ధారావాహికకు కథ, మాటలు, పాటలు, పద్యాలు రాశాను. మా పెద్దబ్బాయి వంశీతో కలసి 'కలుసుకోవాలని..'అనే చిత్రానికి, 'అమ్మాయి బాగుంది' అనే చిత్రానికి సంభాషణలు రాశాను.

## నచ్చినవి

| | |
|---|---|
| కవి | : శ్రీనాథుడు |
| పదకవి | : అన్నమాచార్యుడు |
| చలనచిత్ర రచయితలు | : పింగళి నాగేంద్రరావు, మల్లాది రామకృష్ణశాస్త్రి, ఆత్రేయ |
| నవలా రచయిత | : టెంపోరావ్ |
| నవలలు | : మల్లాది రామకృష్ణ శాస్త్రి 'కృష్ణాతీరం', టెంపోరావ్ 'నాలో ఏముంది?' |
| సినిమా | : మాయాబజార్ |
| గాయని | : భానుమతి |
| గాయకుడు | : ఘంటసాల |
| సంగీత దర్శకుడు | : ఓ.పి. నయ్యర్ |
| వంట | : పప్పుచారు. |

## అమ్మ పలుకు

తెలుగు వినసొంపైన భాష. శక్తిమంతమైన భాష. ఎన్ని అక్షరాలు పలుకుతామో అన్నే అక్షరాలు రాయగలిగిన దివ్యభాష. మరో యాభై ఏళ్ళలో తెలుగు చచ్చిపోతుందంటున్నారు. నిజమోనేమో అనిపిస్తోంది వార్తా పత్రికలలో,



ప్రముఖ డిటెక్టివ్ రచయిత టెంపోరావ్‌తో...

దృశ్యమాధ్యమాల్లో వాడే భాషను చూస్తూ ఉంటే! ఆ రెండు మాధ్యమాలలోనూ వాడే భాష ఇటు వ్యావహారికమూ కాదు; అటు గ్రాంథికమూ కాదు. మూడోరకం. శక్తిమంతమైన ఆ రెండు మాధ్యమాలూ 'మూసభాష' వాడుతూ తేనెసోనల తెలుగును చిత్రవధ చేస్తున్నాయి. వికారం పుట్టించే దుష్ట సమాసాలు తెలుగును నిత్యహత్యకు గురిచేస్తున్నాయి. మన మాతృభాష సజీవంగా ఉండాలంటే ఆ రెండు మాధ్యమాల తీరు మారాలి. పెద్దలు మార్చాలి.

## కుటుంబం

మాకు ముగ్గురు కొడుకులు. పెద్దబ్బాయి వక్కంతం వంశీ చలనచిత్ర రచయితగా స్థిరపడ్డాడు. రెండో అబ్బాయి ప్రభంజన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అమెరికాలో ఉన్నాడు. మూడో అబ్బాయి చైతన్యప్రసాద్ మాతోనే ఉన్నాడు. పిల్లలు వృత్తి ఉద్యోగాల రీత్యా హైదరాబాద్‌లోస్థిరపడ్డాం.

## వైవిధ్యం

కథ, నవల, నాటిక, నాటకం, పద్యనాటకం, హరికథ, సంకీర్తన,అపరాధ పరిశోధన రచన..ఇలా అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేసే అదృష్టం నన్ను వరించినందుకు ఎంతో ఆనందిస్తుంటాను. అన్ని ప్రక్రియలలోనూ రచనకు న్యాయం చేశాను. ఆ ఘనత నాదికాదు. నా మాతృభాష, నా జీవనాడి తెలుగుది!!

– విద్య

**నాకు నచ్చిన నా కథ**

# మోడల్

- వక్కాంతం సూర్యనారాయణరావ్

సంధ్యారాగంతో నిండిన పడమటి ఆకాశం ఆరితేరిన చిత్రకారుడి రంగుల మేళవింపులా వుంది. దూరంగా రహస్యాలు చెప్పుకుంటున్నట్టుగా తలలు వంగిన రెండు కొబ్బరి చెట్ల మధ్య ఎర్రటి సూర్యుడు అస్తమిస్తున్నాడు. సూర్యాస్తమయం... అస్తమయం! ఆత్మారామ్ చిన్నగా నిట్టూర్చాడు. అస్తమిస్తున్న సూర్యుడు ఆలోచనలు రేపుతున్నాడు. ప్రతిప్రాణికి అస్తమయం వుందని నిత్యం అస్తమిస్తూ సూర్యుడు చాటింపు వేస్తున్నాడు. ఉదయించిన సూర్యుడు అస్తమించినట్టే, జన్మించిన ప్రతి మనిషి మరణిస్తాడు...

ఆత్మారామ్ ఆలోచిస్తూ వెనక్కు తిరిగాడు. ఎదురుగా ద్వారానికి రెండు వైపులా గోడకి వున్న రెండు ఆయిల్ పెయింటింగ్స్ అతని దృష్టిని లాగి పట్టాయి. 'ఉదయం' ..... 'అస్తమయం' తనకి ఎంతగానో కీర్తి ప్రతిష్ఠల్ని ఆర్జించిపెట్టిన కళాఖండాలవి. ''చిత్రకారుడుగా ఆత్మారామ్ పరిణతికి ఈ 'ఉదయం', 'అస్తమయం' చిత్రాలు అద్దం పడుతున్నాయి'' అన్నారు ఆ రోజుల్లో విమర్శకులు. పొత్తిళ్ళలో పడుకున్న పసికందు ఎర్రటి బ్యాక్ గ్రౌండ్‌లో, వెల్తురుతో వెలిగిపోతున్న ప్రశాంతమైన చిన్నారి ముఖం పుట్టుకకి, ఉదయానికి అర్థం చెబుతోంది. పక్కనే వున్న 'అస్తయమం'లో మరణించిన మానవుడి ముఖంలో అనంతశాంతి ప్రతిఫలిస్తోంది. నలుపూ, ఎరుపూ కలిసిన బ్యాక్‌గ్రౌండ్‌లో నిర్వికారంగా, నిశ్చలంగా మూసుకున్న కళ్ళతో మరణ గాంభీర్యాన్ని ప్రతిఫలిస్తున్న ముఖం అస్తమయానికి అర్థం చెప్తోంది.

ఆత్మారామ్ ఆ రెండు చిత్రాల్నీ పరిశీలనగా చూస్తూ వుండిపోయాడు. ఒక బొమ్మలోని బాలుడు మరో బొమ్మలో వృద్ధుడై అస్తమించాడు. 'అస్తమయం' చిత్రంలోని ఆ ముఖంలో తన పోలికలు వున్నాయా? ప్రతి చిత్రకారుడూ లోనయ్యే 'పర్సనల్ ఇన్‌ఫ్లుయెన్స్' నుండీ తను ఏనాడో విముక్తుడైనట్టు విమర్శకులు ఇదివరకే పేర్కొన్నారు. మరి... మరణానికి దగ్గరవుతున్న తన చూపులు ఇప్పుడు మునపట్లా లేవా...?

మరణశిక్ష విధించేముందు ఆ మనిషి ఆఖరి కోరిక తీరుస్తారు. మరి తనకి మరణశిక్ష విధించే విధి తన చివరి కోరికను తీరుస్తుందా? ఇంతకీ మరణం తనకి శిక్ష అవుతుందా? జననం ఒక వరమైతే మరణమూ ఒక వరమే. పుట్టుకా, చావూ రెండూ వరాలే; రెండూ ఆనందాలే అన్న విశిష్టమైన, విశాలమైన భావాన్ని తను సృష్టించిన ఈ 'ఉదయం', 'అస్తమయం' చిత్రాలు ప్రతిబింబిస్తున్నాయి...!

''నమస్కారం మాస్టారూ!''

ఆత్మారామ్ ఉలిక్కిపడి, తన ముందు నించున్న శిష్యుడు కామేశాన్ని చూశాడు.

''రా కామేశం.... కూచో'' అంటూ వెళ్ళి పడక్కుర్చీలో కూచున్నాడు. కామేశం మరో కుర్చీలో కూచుని, నిరుత్సాహంగా చూశాడు

''సారీ మాస్టారూ... మోడలింగ్‌కి ఎవరూ అంగీకరించలేదు. మామూలు కన్నా రెండింతలు ఇస్తామని చెప్పి కూడా ప్రయత్నించాను..''

ఆత్మారామ్ మౌనంగా వుండిపోయాడు. మోడల్?... అవును! తనకి ప్రస్తుతం అత్యవసరంగా కావాల్సిన మోడల్ సాధారణంగా దొరకదు! తను చిత్రకారుడిగా రూపొందినప్పట్నించీ ఆ 'మోడల్' కోసం అన్వేషిస్తూనే వున్నాడు – దైవాన్ని అన్వేషించే జిజ్ఞాసువులా; ఎండమావుల్ని వేటాడే ఎడారి బాటసారిలా... అది చిరకాలంగా నిలిచిపోయిన కోరిక. తనలాగే వయసు ముదిరిన కోరిక... తన చివరికోరికగా మారిపోయిన చిరకాల వాంఛ!

''మాస్టారూ...''

ఆలోచనల్లోంచి దిగి, ప్రశ్నార్థకంగా చూశాడు ఆత్మారామ్.

''మీకు పూర్వం మోడల్సుగా వున్న వాళ్ళల్లో ఒకరిద్దరు ఇప్పుడు మనం కోరే స్టేజిలో వున్నారు. కానీ పెళ్ళయ్యాక వాళ్లు మోడలింగ్‌కే స్వస్తి చెప్పారు. అదీగాక ఆ స్థితిలో నగ్నంగా ఫోజు ఇవ్వడానికి వాళ్ళు ససేమిరా ఒప్పుకోటం లేదు. ఆడవాళ్ళ సంగతి... మీకు తెలుసు''.

''తెలుసు నాయనా! మనిషికి జీవితంలో ఏదో ఒక బలమైన కోరిక వుంటుంది. అది తీరేదాకా అతనికి శాంతిలేదు... నాకూ ఒక జీవితాశయం వుంది. దాన్నితీర్చుకోడం కోసం నిర్విరామంగా ప్రయత్నిస్తున్నాను...''

''ఇంకా ప్రయత్నించుదాం మాస్టారూ... అదృష్టం కలిసిరావొచ్చు'' అన్నాడు కామేశం ప్రోత్సహిస్తున్నట్టు. ఆత్మారామ్ విచారంగా చూశాడు. ప్రయత్నించి, చిరునవ్వు నవ్వాడు.

''అదృష్టం కలిసి వచ్చేదాకా ఆయుష్షు వుండదు కామేశం!''

''అలా అనకండి. మీరు.. ఆరోగ్యం గానే వున్నారు..'' అన్నాడు కామేశం.

''ఆయుష్షుకీ, వయసుకీ సంబంధం లేదు కామేశం. నెలలోగా నేను ఈ పెయింటింగ్ వేసేయాలి!''

కామేశం ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా చూశాడు.

''కామేశం... నీకో సంగతిచెప్తాను. దాన్ని నీ హృదయంలో దాచుకుంటావా?'' ఆత్మారామ్ తదేకంగా చూస్తూ అడిగాడు.

''చెప్పండి'' అన్నాడు కామేశం.

''నాకు టెర్మినల్ కాన్సర్ వుంది... డాక్టర్ ఆర్నెల్ల వ్యవధి ఇచ్చాడు. అయిదు నెలలు గడిచిపోయాయి....''

''మాస్టారూ!'' కామేశం కంఠం బొంగురుగా వుంది. వణుకుతున్న కుడి చేత్తో ఆత్మారామ్ చేతిని పట్టుకున్నాడు. ఆ చేతివేళ్ళు అతని వ్యధని ధ్వనిలేని భాషతో ఆత్మారామ్‌కు నివేదిస్తున్నాయి. అతని కళ్లు చెమ్మగిల్లాయి.

''మాస్టారూ! నాకేం దిక్కుతోచట్లేదు... మీరు...'' మాట మధ్యలో అతని కంఠం మూగవోయింది.

''కామేశం... చావుపుట్టుకల మధ్య వున్న అంతరం చాలా చాలా పల్చటిది. దాన్ని ఎంతో దళసరి ఇనుపతెరలా ఊహించుకుంటాడు మనిషి. అది పొరపాటు'' అత్మారామ్ వేదాంత ధోరణిలో వోదార్పుగా అన్నాడు.

''మీ మాటలు నా ఆవేదననీ, భయాన్నీ పెంచుతున్నాయి మాస్టారూ!''

ఆత్మారామ్ సానుభూతిగా చూశాడు. ''కామేశం.. నా స్థితిలో నిన్ను ఊహించుకుని ఆలోచించి చెప్పు!''



కామేశం తటాలున తలెత్తి చూశాడు. తన కళ్ళల్లోని తడి తనకూ ఆయనకూ మధ్య విధి పట్టిన పల్చటితెరలా వుంది. అతను కళ్ళు తుడుచుకుని చూశాడు. తెల్లటి పల్చటి గిరజాల జుట్టు, ఎన్నో గీతలుగా రూపొందిన విశాలమైన నుదురు. గుబురుగా వున్న తెల్లటి కనుబొమ్మలు. తీక్షణంగా, లోతుగా చూసే పెద్దపెద్ద కళ్ళు. పొడుగాటి ముక్కు. తెల్లటి దుస్తుల్లో వున్న ఆత్మారామ్ మేధావిలా అవుపిస్తున్నాడు...

''మాస్టారూ! పరిస్థితి ఇంతలావుందని తెలీకపోయినా, గట్టిగానే ప్రయత్నించాను. ఇంకా ప్రయత్నిస్తాను!'' అన్నాడు ఉద్రేకంతో.

ఆత్మారామ్ నవ్వుతో చూశాడు. ''టేకిట్ ఈజీ!''

''రేపొస్తాను మాస్టారూ'' అంటూ బైటికి నడిచాడు కామేశం.

***

''నన్ను క్షమించండి మాస్టారూ... ఓడిపోయాను...''

ఆత్మారామ్ కామేశాన్ని జాలిగాచూసి నిట్టూర్చాడు.

''... నా భార్యకి ఇప్పుడు ఎనిమిదో నెల. ఆమెని వొప్పించటానికి విశ్వ ప్రయత్నం చేశాను. రత్న... అంగీకరించలేదు. ఇద్దరిమధ్య గొడవ జరిగింది. మీరు నన్ను...''

''అర్థం చేసుకున్నా నాయనా! అమ్మాయిని అపార్థం చేసుకోకు. నీ భార్యే కాదు...

ఎవరి భార్య అయినా అంతే. నాలోని ఆర్టిస్టుని చూసి నన్ను ప్రేమించి పెళ్ళాడిన నా భార్య ఆనాడే అంగీకరించి వుంటే నా కోరిక ఏనాడో తీరి వుండేది!''

కామేశం ఆశ్చర్యంగా, విచారంగా చూశాడు. ఏదో చెప్పబోయి ఆగాడు.

''సృష్టిలోని అద్భుతాల్లో గర్భవతి ఒకటి. గర్భిణి అందానికి పరాకాష్ఠ. మనుషుల్లోనే కాదు – జంతువుల్లో, పక్షుల్లో చూడు! గర్భంలో తన ప్రతిరూపాన్ని దాచుకున్న ప్రతి ప్రాణీ అందానికి ఒక నిండుతనాన్నీ, ఒక సంపూర్ణతనీ చేకూరుస్తుంది! ఆ అందాన్ని, ఆ సౌందర్య పరాకాష్ఠని దేంతోనూ కొలవలేం. ఆఖరికి మన కుంచెతో కూడా!'' ఆత్మారామ్ ఆవేశంతో చెప్పి, ఆగాడు. అతని కళ్ళు మెరుస్తున్నాయి. ఆ మెరుపులో ఒక ఆరాధన ప్రతిఫలిస్తోంది.

కామేశం ఏదో చెప్పబోయాడు. తలుపు దగ్గర చప్పుడైంది. ట్రేలో టీ కప్పుల్తో వినయ వస్తూ కామేశాన్ని చూసి, పలకరింపుగా నవ్వింది. ట్రేని టీపాయ్ మీద పెట్టి ఒక కప్పుని ఆత్మారామ్‌కి అందిస్తూ.

''టీ తీసుకోండి మామయ్యా'' అంది.

ఆత్మారామ్ కప్పు అందుకుంటూ కోడల్ని చిరునవ్వుతో చూశాడు. వినయ కామేశానికి టీ ఇచ్చి మామగారి వేపు చూసింది!

''ఆయన ఉత్తరం రాశారు మావయ్యా! ఢిల్లీలో ఇంకా పదిహేను రోజులు వుండాలిట. రావడానికి ఇరవైరోజులు పట్టొచ్చని రాశారు. మీ యోగ క్షేమాలు రాయమన్నారు''.

''వాడి ఉద్యోగానికి ఎప్పుడూ క్యాంపులే. ఏడాదిలో ఒక నెలేనా ఇంటి పట్టున వుంటానికి లేదు! త్వరగా రమ్మని రాయమ్మా'' అన్నాడు ఆత్మారామ్.

వినయ తలాడించి, వెళ్ళిపోయింది. ఆత్మారామ్ కామేశాన్ని చూశాడు.

''వెళ్ళి రా కామేశం. ప్రయత్నం మనది. ఫలితం మన చేతుల్లో లేదు. అంతా

మర్చిపో'' అన్నాడు. కామేశం నీరసంగా లేచాడు.

***

వినయ కాఫీ కప్పుని టీపాయ్‌మీద పెట్టింది. ఆత్మారామ్ ఆమెని చిరునవ్వుతో చూస్తూ కాఫీ అందుకున్నాడు. వినయ నిలబడే వుంది. కాఫీ తాగేసి, ఆత్మారామ్ కప్పుని ఆమెకు అందించాడు. అందుకున్న కప్పుని వినయ టీపాయ్ మీదపెట్టి, అలాగే నిలబడింది. ఆత్మారామ్ తలెత్తి చూశాడు. ఆమె కళ్ళు తదేకంగా అతన్నే చూస్తున్నాయి. తనతో ఏదో చెప్పబోతున్నట్టనిపించింది ఆమె వాలకం తనకి. ఆమె పెద్దపెద్ద కాటుక కళ్లు మౌనంగా, గంభీరంగా ఏదో... ఏదో... చెప్తున్నాయి...

''ఏదేనా చెప్పాలా వినయా?'' ఆత్మారామ్ అడిగాడు.

''నాకిప్పుడు తొమ్మిదో నెల మామయ్యా'' అందామె క్లుప్తంగా.

అతను ఆమెను వాత్సల్యంతో చూశాడు. ''తెలుసమ్మా..''

''తెలిసేనా ఇంతకాలం నన్ను నిర్లక్ష్యం చేశారు?''

వినయ ప్రశ్న అతన్ని చిన్నగా కుదిపింది. ''ఆ... ఏంటమ్మా?''

''నా నుంచే మీరు రెండు విషయాలు దాచారు..'' అందామె చిన్నగా నవ్వుతూ.

''వినయా!''


''మీ అనారోగ్యం గురించి మీరు నిజం చెప్పలేదు. టెర్మినల్ కాన్సర్‌ని అడపా దడపా వచ్చే కడుపు నొప్పిగా చిత్రించారు.''

ఆత్మారామ్ ఆందోళనతో చూశాడు. ''వినయా! నీకు... నీకెలా తెలుసు....'' అతని కంఠంలో వణుకు.

వినయ అదోరకంగా నవ్వింది. ''చెవులు కామేశానికే కాదు.. నాకూ వున్నాయ్ మావయ్యా!''

ఆత్మారామ్, ఓటమిని అంగీకరిస్తూ నిట్టూర్చాడు. ''నువ్వూ, అబ్బాయీ బాధ పడతారనీ, తెలిస్తే బాధతప్ప మరో ప్రయోజనం లేదనీ చెప్పలేదమ్మా... పైగా ఈ స్థితిలో నువ్వు హాయిగా వుండాలి. మీ ఇద్దర్నీ భయపెట్టడం దేనికని.. నాలోనే దాచుకున్నాను. జబ్బు ట్రీట్‌మెంట్‌కి లొంగే స్టేజిని దాటిపోయింది. ఖచ్చితంగా జరగబోయేది కళ్ళకి కట్టినట్టు కనిపిస్తోంది. అబ్బాయి మొండి. వైద్యమనీ అదనీ నానా హంగామా చేస్తాడు. శరీరంలో పటుత్వం తగ్గేక ఇలాంటి రోగాలకు లొంగి పోడం, బాధని తగ్గిస్తుందన్నాడు డాక్టరు. పోరాడితే శరీరం నరకయాతనకు గుర వుతుంది అందుకని....'' ఆత్మారామ్ మెల్లిగా ఆగాడు.

వినయ కళ్ళు నీళ్ళతో మెరిశాయి. ''మామయ్యా... చిన్నతనంలో తండ్రిని కోల్పోయిన నాకు మీరు ఆలోటు తీర్చారు. మా అమ్మ చనిపోయాక తల్లిలేని లోటూ మీరే తీర్చారు. మీరు... లేకపోతే.. నాకు తల్లీతండ్రీ ఇద్దరూ లేనట్టే మామయ్యా!'' వినయ కంఠం దీనంగా వుంది. రెండు బుగ్గల మీదా కన్నీళ్ళు గీతలు గీశాయి. అరచేతుల్తో బుగ్గల్ని తుడుచుకుందామె.



ఆత్మారామ్ గర్వంగా ఆమెని చూశాడు. తల్లిదండ్రుల పాత్రల్ని తను అంత బాగా నిర్వహించాడా! సాధారణంగా ఏ మామయ్యకూ ఇలా మెప్పు లభించి వుండదు. వినయ అతనివేపు నిదానించి చూసింది.

''ఇక రెండో విషయం.... ఇంట్లో ఒక గర్భిణీ స్త్రీని పెట్టుకుని, మీరు గుర్తించ కుండా వుండిపోయారు!'' అందామె ఆక్షేపణగా.

''వినయా!'' ఆత్మారామ్ మొహం ఆశ్చర్యాన్ని భూతద్దంలా చూపిస్తోంది.

''మీ...చివరి... చిరకాల వాంఛ తీర్చుకోవటానికి లోకమంతా గాలిస్తున్నారు. ఇంట్లో వెన్న పెట్టుకుని నెయ్యికోసం వెతుకుతున్నారు!''

''వినయా!''

''ఆశ్చర్య పడుతున్నారా? లోకంలోని గర్భిణి స్త్రీలకి వుండేస్థానం మీ దృష్టిలో నాకు లేదా మామయ్యా?''

''అమ్మా!''

''నా బొమ్మ మీరు వేయకూడదా?''

''అమ్మా... వినయా?''

''నన్ను మోడల్‌గా వుపయోగించుకుని, మీరు కలలు కన్న చిత్రాన్ని సృష్టించి, తృప్తిపొందండి!''

నీళ్ళల్లో మునిగి పోతున్న ఈతరాని వ్యక్తిలా ఆత్మారామ్ ఉక్కిరి బిక్కిరవుతూ తల విదిల్చాడు. ''తల్లీ... నాకు మాటలు రావడం లేదు. నువ్వు ... నువ్వు నా కోడ లివి... నా కొడుకు భార్యవి. నిన్ను... నిన్ను...'' ఆత్మారామ్ ఊపిరాడనట్టు విలవి ల్లాడుతూ ఆగాడు. ఆశ్చర్యంతో, నమ్మ లేనట్టు ఆమెని చూశాడు. తనముందు నించున్న వినయ అయిదడుగుల అమ్మాయి కాదు... అదో విశ్వరూపం. ఆమె కంఠం విశ్వ నినదంలా అతని హృదయంలో ప్రతిధ్వనిస్తోంది. ఏమిటో అయో మయం... ఏమిటో గందరగోళం..

''మరొకరి కోడల్ని, మరొకరి భార్యని మోడల్‌గా చూడగలిగే మీ కళ్ళు... మీ కోడల్ని, మీ కొడుకు భార్యని మోడల్‌గా చూడగలుగుతాయి అనుకున్నాను మామయ్యా..''

ఛర్నాకోల్ దెబ్బలా తగిలిందామె మాట ఆత్మారామ్‌కి. అతను ఇంక పడక కుర్చీలో కూచోలేకపోయాడు. తటాలున లేచి నించున్నాడు. తన కళ్ళని కప్పిన నీటి పొరల వెనకనుంచి తన కోడల్ని చూశాడు. పల్చగా కురుస్తున్న మంచుతెర వెనక నుంచీ అవుపిస్తున్న రమణీయమైన ప్రకృతి దృశ్యంలా వుందామె అతని కళ్ళకి. తను కళ్ళని ఒకసారి మూసి తెరిచాడు. కళ్ళముందున్న తెర కరిగిపోయింది. వినయ అతన్ని మౌనంగా చూస్తోంది. ఆత్మారామ్ తాత్కాలికంగా మూగవాడైపోయాడు.

వినయ తలంటి పోసుకున్నట్టుంది. వొత్తుగావున్న జుత్తు నిగనిగ లాడుతూ నీలి రంగు జలపాతంలా కిందకి జారుతోంది. విశాలమైన కళ్లు మెరుస్తున్నాయి. కోలమొహం. నునుపుదేరిన బుగ్గలు స్త్రీకి గర్భం సంతరించి పెట్టే అందానికి అద్దాల్లా వున్నాయి. నిండు చూలాలయిన వినయ అతనికి బొండు మల్లెనీ, ముద్ద బంతినీ, పొరల్లోపల అందంగా, ఉబ్బిన మొక్క జొన్నకండెనీ గుర్తుకు తెస్తోంది. చక్కటి వర్ణచిత్రానికి ఇంపైన చట్రంలా, ఆకు పచ్చరంగు దుస్తులు ఆమె సౌంద ర్యాన్ని హెచ్చువేత వేస్తున్నాయి. ఓహ్! వినయ తన కోడలు... నిండు చూలాలు... అందాల భరిణ!

''మాట్లాడరేం మామయ్యా!'' వినయ ప్రశ్న అతన్ని హెచ్చరించింది. దగ్గరగా అడుగులేసి, ఆమె భుజం మీద చెయ్యి వేశాడతను. గౌరవ భావంతో ఆమె కళ్ళ ల్లోకి చూశాడు.

''నన్ను... ఏదో ప్రవాహంలోకి లాక్కుపోతున్నావు... జలపాతంతో పాటు నేను ఏదో అగాధాల్లోకి పడిపోతున్నాను... మళ్ళీ... ఎందుకో... మేఘాల్లోకి ఎగిరిపోతు న్నాను... నాకు ఊపిరాడ్డడం లేదు...'' ఆత్మారామ్ నిస్సహాయంగా తలాడిస్తూ వుండిపోయాడు.

వినయ అతని కళ్ళల్లోకి తదేకంగా చూసింది. ''నేనొకటి అడుగుతాను... హృద యపూర్వకంగా సమాధానం చెప్పండి. కామేశం భార్య రత్న అంగీకరిస్తే మీరా మెను మోడల్‌గా వాడుకుంటారా లేదా?''

ఆత్మారామ్ మాట్లాడకుండా చూశాడు. ఆమె చూపులు అతన్ని చూపుల్ని లాగి పట్టాయి. నిజాయితీగా సమాధానం చెప్పమని అతని హృదయాన్ని ఆజ్ఞాపిస్తు

న్నాయి. ఆత్మారామ్ నాలుక కొనతో ఆరిపోయిన పెదవుల్ని తడుపుకున్నాడు.

"…. ఉపయోగించుకుంటాను".

చిరునవ్వు ఆమె మొహాన్ని వెలిగించింది. "నాలో తక్కువైంది, లేదా ఎక్కువైందీ ఏమిటి?" వినయ ప్రశ్న అతని హృదయాన్ని కమ్చీదెబ్బలా తాకింది.

"వినయా…."

"కోడలు హోదా నన్ను ఎక్కువచేసి, నా అర్హతని తక్కువచేసిందా?" ఆమె కళ్లు నవ్వుతున్నాయి.

"అమ్మా…"

"మీరు తలపెట్టిన పనికి మరొకరి భార్యను, మరొకరి కోడల్ని అడిగే ముందు మీ కొడుకు భార్యను, మీ కోడల్ని అడగాల్సిన ధర్మం, విధి మీకు లేవంటారా మామయ్యా?"

"తల్లీ…!"

"మీరు 'మామగారి కళ్ళతో', మరో పురుషుడి కళ్ళతో నన్ను చూడరు. మీలోని ఆర్టిస్టు తన కళానేత్రాలతో నన్ను చూస్తాడు… కాదంటారా?"

ఆత్మారామ్ మాట్లాడ్డం మరచిపోయాడు. సూర్యుడి చండకిరణాలు మంచుగడ్డని కరిగించినట్టు, వినయ మాటలు, ప్రశ్నలు అతని హృదయాన్ని కరిగించేస్తున్నాయి. ఆనందాశ్రువులు అతని పల్చటి చెక్కిళ్ళ మీద జీవనదులయ్యాయి. వ్యక్తం చేయాలనుకుంటున్న వెయ్యి భావాలు అతని కంఠంలో ముసురుకుని అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆత్మారామ్ నిస్సహాయంగా, దీనంగా కన్నీళ్ళతో ఆమెని చూస్తుండి పోయాడు. ఆమె అతన్ని తీక్షణంగా చూసింది.

"కుంచెను అందుకోండి. నా ప్రతిరూపంతో మీలోని కళకి ప్రాణం పోయండి!"

ఆత్మారామ్ ఛాతీ పైకిలేచింది. అతను ఉద్రేకంతో ఆమెనుచూశాడు. అతని కళ్ళల్లో ఏదో ఆరాధన వెలుగుతోంది. తన ఆరాధ్యదేవతను చివరికి ప్రత్యక్షంగా చూస్తున్న ఏకాంత భక్తుడిలా ఉన్నాడతను. ఆత్మారామ్ కళ్ళు తడిగా మెరుస్తూ ఆ దేవతకు దీపారాధన చేస్తున్నాయి.

"మామయ్యా… లోకం లోని అందరు ఆడవాళ్ళని చూసినట్టు, మామూలుగా నన్ను చూడండి. ఎక్కువచేసి చూడకండి. అంతే నేను కోరేది. మీ ఆశయసాధనలో నన్నొక పనిముట్టుగా ఉపయోగించుకోండి"

"అమ్మా!"

***

"వినయా!"

భర్త కంఠంలో కొత్తధ్వని విని వినయ ఉలిక్కిపడి తిరిగి చూసింది. మురారి ముఖం ఉబ్బినట్టుంది. కళ్ళల్లో ఎర్రజీర కనిపిస్తోంది. ఆవేశంతో అతని ఛాతీ ఎగిరెగిరిపడుతోంది.

"ఏమిటీ అన్యాయం?" మురారి అరిచాడు. అతని వళ్ళంతా కోపంతో వణుకుతోంది. అతను దేన్ని అన్యాయం అంటున్నాడో వినయకి అర్థమై పోయింది. అయినా తెలీనట్టు అడిగింది.

"ఏమిటండీ?"

"మామగారూ, కోడలూ బజారు మనుషుల్లా ప్రవర్తించి నా పరువుని నడి వీధిలోకి ఈడ్చారు! మీ ఇద్దరికి మతులు పోయాయా?" మురారి బిగ్గరగా అరిచాడు.

వినయ ఈ సన్నివేశాన్ని ముందే ఊహించింది.

"కాస్త మెల్లగా మాట్లాడండి… మామగారు వింటారు" అంది తగ్గు స్వరంతో.

"అంతా చూశాక, ఇంతా చేశాక ఎంత విన్నా పోయేదేమీలేదు. సభ్యతా, సంస్కారం వుండే మనుషులున్న ఇల్లనుకున్నాను గానీ…. ఛీఛీ!" మురారి శ్రుతి పెరుగుతోంది. అరుస్తూంటే అతని మెడ నరాలు పురెక్కిన తాళ్ళలా కనిపిస్తున్నాయి.

వినయ దగ్గరగా నడిచి అతని చెయ్యి పట్టుకోబోయింది. మురారి విదిలించుకున్నాడు. ఆమె అతన్ని ప్రాధేయ పూర్వకంగా చూసింది.

"దయచేసి శాంతంగా వినండి. అంతా వివరంగా చెప్తాను.. అంతా విన్నాక…"

"కళ్లారా అంతా చూశాను. వినాల్సింది ఏమీలేదు. నువ్వున్న స్థితిలో ఏ ఆడదీ ఇంతకి తెగించదు. ఆఖరికి కులటకూడా!" మురారి కళ్లు నిప్పులు చెరుగుతున్నాయి.

## 'మెడల్' ఎందుకు రాశాను?



తనదాకా వస్తే మనిషి ఎలా స్పందిస్తాడు? అనే ప్రశ్నకు సమాధానంగా ఆవిర్భవించిన కథ ఇది. తన నిజ స్వరూపం లోకానికి కనిపించకుండా మనిషి ముసుగు ధరిస్తాడు. ఆ ముసుగు చాలా అందంగా, హుందాగా ఉంటుంది. ఆ ముసుగుని తొలగించి పారవేస్తే గానీ మనిషి నిజ స్వరూపం కళ్ళకు కట్టదు. భిన్నవ్యక్తిత్వాలతో జీవితం నరక ప్రాయమవుతుందన్న సత్యాన్ని ఈ కథ ద్వారా స్పష్టం చేశానని అనుకుంటూ ఉంటాను. ఈ కథలో ఒక రకమైన నిజాయతీ, నిరంకుశత్వం ప్రత్యక్షమవుతాయి.

**-వక్కంతం సూర్యనారాయణరావ్**
**9866267287**

"ఏమండీ…" వినయ కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి. మురారి ఉరిమి చూశాడు.

"ఏం? అక్కడ గుడ్డలు ఊడబీక్కుని పోజులిస్తూ పర పురుషుడి చూపుల్ని తట్టుకోగలిగే నువ్వు నా మాటల్ని భరించలేవూ?"

వినయ అతని మొహంలోకి వోరగా చూసింది. "మామగారు పర పురుషులు కారు!"

"ఆడదానికి కట్టుకున్న వాడు తప్ప అందరూ పరపురుషులే! అవునులే… నువ్వు అందరిలాంటి ఆడదానివి కావుగా! న్యూడ్ పెయింటింగ్స్ అయ్యాయి; ఇహ ఫొటోలు కూడా దిగి పత్రికలకి పంపడమే తరువాయి" మురారి కంఠంలో వెటకారం, కోపం పెనవేసుకున్నాయి.

వినయ తలెత్తి అతన్ని కోపంగా చూసింది. "మీరు అర్థం లేకుండా మాట్లాడుతున్నారు".

"అవును! అయినింటి ఆడపిల్ల, పెద్దింటి కోడలు, నిండు చూలాలు దిస మొలతో నిలబడి ఆయిల్ పెయింటింగ్ వేయించుకున్న చేతకి అర్థం వుంది. అభాసుపాలవుతోందన్న ఆరాటంతో ఆడే నా మాటలకి అర్థం లేదు" ఆక్షేపణగా అని మురారి క్షణకాలం ఆగాడు. ఆమె వేపు తదేకంగా చూశాడు,

"వినయా…. నువ్వు ఇన్ని మెట్లు కిందికి దిగేస్తావని నేను వూహించలేదు. కోడళ్ళు ఒంటినిండా పైట కప్పుకోకుండా మామగారి ముందుకి వెళ్ళడానికి కూడా భయపడతారు, సిగ్గుతో చచ్చిపోతారు".

"మామగారి చూపులు అలాంటివి కావండీ" వినయ అడ్డొస్తూ చెప్పబోయింది. మురారి ఎగతాళిగా నవ్వాడు.

"అందుకు సందేహం లేదు. నీ మామగారి చూపులు ప్రత్యేకమైనవి. నీ కుడి తొడ లోపలి భాగంలో వున్న ఆవగింజంత పుట్టుమచ్చ కూడా ఆయన చూపుల్నించీ తప్పించుకోలేక పోయింది! హు… కన్న తండ్రీ, కట్టుకున్న ఆడదీ నన్ను మోసగించారు! అన్యాయం చేశారు! మిమ్మల్ని… మిమ్మల్ని.." మురారి ఆవేశంతో రొప్పుతున్నాడు. వినయ అతన్ని నిదానించి చూసింది.

"ఏ పరిస్థితి వల్ల అలా చేయాల్సి వచ్చిందో తెలిస్తే మీరిలా మాట్లాడరు".

మురారి అసహనంగా చెయ్యెత్తి ఆమెని వారించాడు. "ఎంత భయంకరమైన పరిస్థితి అయినా జరిగిన దారుణాన్ని జస్టిఫై చేయలేదు. ఒక ఇల్లాలు, నిండు చూలాలు రోజుల తరబడి తన మామగారి ముందు నగ్నంగా నిలబడి బొమ్మ గీయించుకోడానికి పురిగొల్పే పరిస్థితి ఈ సృష్టిలో ఉద్భవించదు. అలాంటి పరిస్థితి వచ్చిందనుకోవడం కేవలం ఆత్మవంచన. మీరిద్దరూ క్షమించరాని అపరాధం చేశారు. వృద్ధాప్యంలో అనారోగ్యంతో ఆయన మతి చలించింది. నువ్వు… నువ్వు నన్ను ఎందుకిలా హింసించావు? నీకేం అపకారం చేశాను? ఎందుకు నాకీ శిక్ష?" మురారి అరిచాడు. అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

వినయ కళ్లు నీళ్ళతో నిండాయి.

"ఏమండీ… పూర్తిగా చెప్పే అవకాశం నాకు ఇవ్వండి. ఒక చూలాలిని పెయింట్ చేయాలన్న మామగారి జీవితాశయం తీరని కోరికగా – ఈ జన్మలో తీరని కోరికగా – వుండిపోయింది. అదే ఆయన… చివరి… కోరిక.."

మురారి వెటకారంగా నవ్వాడు. "థాంక్ గాడ్! ఆయనగారి చివరి కోరిక అదొక్కటేనా?"

వినయ భర్తని ఆశ్చర్యంతో చూసింది. ఆమె మొహం కోపంతో, అవమానంతో కందిపోయింది. "మరీ హీనంగా మాట్లాడకండి! మనిషై పుట్టేక బుద్ధీ, ఇంగితం వుండాలి! ఆవేశంలో మీరు సత్యాన్ని చూడలేక పోతున్నారు".

మురారి పళ్ళు కొరుకుతూ చూశాడు. "చూశాను. సత్యాన్ని, రేపోమాపో ప్రసవించబోయే నిండు గర్భిణిలా వున్న సత్యాన్ని, అయిదడుగుల పొడవున్న నగ్నసత్యాన్ని, సిగ్గునీ, బిడియాన్నీ, మానాన్నీ, మర్యాదనీ కట్టుకున్న గుడ్డలకి మల్లే విడిచి పారేసి, ఏకాంతంలో భర్తముందు కూడా ప్రవర్తించని ఒడుపులో, భంగిమలో వున్న పూర్తి నగ్నసత్యాన్ని కళ్లార చూశాను! ఇంక లోకం చూడ్డమొక్కటే మిగిలి వుంది. వెళ్ళండి… మామా, కోడలూ ఇద్దరూ ఎగ్జిబిషన్స్ పెడుతూ ఊరూరా తిరగండి. సజీవమైన కోడలు గారి నగ్న సౌందర్యాన్నీ, దానికి సరితూగేలా మామ

గారు సృష్టించిన లైఫ్‌సైజ్ పెయింటింగ్‌నీ ఇద్దరూ కలిసి అందరికీ చూపించండి! వెళ్ళండి... వెళ్ళిపొండి'' మురారి ఇల్లు అదిరిపోయేలా అరిచాడు. తలుపుల్ని దభాల్న మూస్తూ గదిలోంచి తుఫానులా వెళ్ళిపోయాడు. వినయ మూసుకున్న తలుపువేపు కాసేపు అలాగే చూస్తూ నిలబడి పోయింది. మెల్లిగా అడుగులు వేసి, కుర్చీలో కూచుని డైనింగ్ టేబుల్ మీద బలహీనంగా తలను వాల్చేసింది. వెచ్చటి కన్నీళ్ళు ఆమె చెక్కిళ్ళకు కాటుక రంగు పూస్తున్నాయి.

***

వినయ మెల్లిగా మెట్లెక్కి, తలుపుల్ని తోసుకుని గదిలోకి ప్రవేశించి తటాలున ఆగింది. ఆశ్చర్యంతో, ఆందోళనతో ఆమె కళ్ళు పెద్దగా అయ్యాయి. పెయింటింగ్ ముందు ఆత్మారామ్ నిలబడి వున్నాడు. కొద్దిగా పైకిలేచిన అతని కుడిచేతిలో అర చెయ్యంత వెడల్పున బ్రష్ వుంది. ఆ బ్రష్ నల్లరంగు పెయింట్‌ను చిక్కగా కలియ తిప్పుతుంది డబ్బాలో! అతని చెయ్యి వశం తప్పినట్టు వణుకుతోంది.

''ఆగండి!'' అప్రయత్నంగా అరిచింది వినయ. ఆత్మారామ్ అదిరిపడి, తిరిగి చూశాడు. నీరసంగా వున్న అతని మొహం చెమట బిందువులతో నిండింది. వెండి వెంట్రుకల పొట్టి గెడ్డం మెరుస్తోంది. ఎర్రగా వున్న కళ్ళు, తప్పుచేస్తూ పట్టుబడిపోయిన కుర్రాడి కళ్ళలా బెదురుచూపులు చూస్తున్నాయి.

వినయ చేతిలోని ట్రేని టీపాయ్ మీద పెట్టి గబగబా అతని దగ్గరగా నడిచింది. ఆమె చూపులు పెయింటింగ్‌ని ఆత్రంగా పరిశీలించాయి. బాత్‌రూమ్‌లోని పెద్ద అద్దంకూడా తన రూపాన్ని, తన సౌందర్యాన్ని అంత స్పష్టంగా, ఖచ్చితంగా చూపించదనిపించి దామెకి. అదృష్టం! తను సరైన సమయానికి వచ్చింది...

వినయ ఆత్మారామ్‌వేపు చూపుల్ని తిప్పింది. ఆమె పెదవులు కొద్దిగా అదురుతున్నాయి.

''వినయా... మీ ఇద్దరిమధ్యా అభిప్రాయాల అగాథాల్నీ, కోపతాపాల గోడల్నీ సృష్టించి, పదిహేనురోజులుగా మీ ఇద్దర్నీ వేరుచేసి, మీ దాంపత్యానికి శాపంగా పరిణమించిన నా కళా సృష్టిని చెరిపేసి...''

''మామయ్యా!''

''అవునమ్మా! కళాకారుడి సృష్టి ఎదుటి వ్యక్తికి మేలుచేయాలి. విశ్వశ్రేయస్సే కళకి పరమావధి. నా కుంచె రెండు జీవితాల మధ్య వున్న అనుబంధాన్ని ఖండించి వేసే గొడ్డలిగా మారింది. అది క్షంతవ్యం కాదు. నా కొడుకూ కోడళ్ళమధ్య, నా పిల్లల మధ్య ముళ్ళకంచెలా, ఇనపగోడలా నిలిచిన ఈ చిత్రాన్ని... సృష్టించిన ఈ హస్తంతోనే... తుడిచి... వేయాలి.. తప్పదు... నన్ను క్షమించు తల్లీ..''

వినయ అతన్ని జాలిగా చూసింది. ''మామయ్యా... ఆస్కార్‌వైల్డ్ నవల 'పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే' మీరు చదివారా?'' ఆమె ప్రశ్నించింది.

ఆత్మారామ్ అసంకల్పితంగా చదివానన్నట్లు తలాడించాడు.

''అందులో డోరియన్ గ్రే తన వార్ధక్యాన్నీ, క్రౌర్యాన్నీ ప్రతిబింబించే తన వర్ణచిత్రాన్ని కత్తితో తునాతునకలు చేస్తాడు. తెల్లారేసరికి ఆ పెయింటింగ్ ముందు కత్తిపోట్లతో అతను చచ్చిపడుంటాడు. ఆ సన్నివేశంలో రచయిత వ్యక్తంజేసిన అద్భుతమైన భావం మీకు అర్థమైందా?'' వినయ శాంతంగా అడిగింది.

ఆత్మారామ్ మంత్రముగ్ధుడిలా తలాడించాడు. అతని చేతిలోని బ్రష్‌లోంచి పెయింట్ బొట్లుగా నేలమీదకి కారిపోతోంది. వినయ అతనివేపు ఆవేదనతో చూసింది.

''ఈ చిత్రం మీరు గీస్తూంటే స్నానం చేయించడానికి పిలిచిన తండ్రి ముందు గుడ్డల్లేకుండా నిలుచున్న చిన్నారి పాపాయిలా నించున్నాను. నా మనసు, నా హృదయం, నా ఆత్మ, నా సర్వస్వం మీ కళాతపస్సుకి అంకితం చేసి, స్త్రీకి సహజంగా రెండో చర్మంలా వుండే సిగ్గునీ, భయాన్నీ, మనిషి చుట్టూ నాగరికత నిర్మించిన కట్టుబాట్ల గోడల్నీ, అసత్య మర్యాదల్నీ, ఇన్హిబిషన్స్‌నీ – అన్నింటినీ పాము కుబుసంలా విడిచేసి, స్వచ్ఛంగా, అప్పుడే పుట్టిన అసలు మనిషిలా నుంచున్నాను మామయ్యా...'' వినయకంఠంలో ఏడుపు ధ్వనిస్తోంది. ఆమె కళ్ళల్లోంచి రెండు అశ్రుకణాలు జారాయి. ఆత్మారామ్ కదలిపోతున్నాడు.

''వినయా!''

''మీరు ఈ బొమ్మను చెరిపేస్తే, డోరియన్ గ్రేలా నేనూ చెరిగిపోతానేమో మామయ్యా...'' వినయ కన్నీళ్ళతో అతన్ని చూసింది.

ఆత్మారామ్ చేతిలోని బ్రష్ తటాలున కింద పడిపోయింది.

''అంత మాటనకమ్మా వినయా!'' అతను బావురుమన్నాడు.

''మీ కొడుక్కి వయసొచ్చిందిగానీ ఆయన ఎదగలేదు. తన భార్య పొట్లంలో పువ్వులా, సభ్యతనీ మర్యాదనీ దుస్తులుగా కట్టుకుని సంసార పక్షంగా వుండాలని కోరుతూ, పరస్త్రీని నగ్నంగా చూడ్డానికి వెనకాడని మగాళ్ళు అంత తొందరగా ఎదగలేరు మామయ్యా!''

''అమ్మా...''

''మీరు ఈ కేన్వాస్ మీద నా రూపాన్ని చెరిపి వెయ్యొచ్చు; కానీ ఆయన మెదడు మీద పచ్చపొడవబడిన ఈ పెయింటింగ్ నకలును, ఈ నగ్న స్వరూపాన్ని, ముఖ్యంగా మీరు చూసి చిత్రించిన నా నగ్నస్వరూపాన్ని తుడిచి వేయలేరు''

ఆత్మారామ్ మాటలు మరచిపోయిన వాడిలా చూస్తున్నాడు.

''మీరే ఆలోచించండి... మరొక ఆడదాన్ని మీరు పెయింట్ చేసి వుంటే మీ కొడుకు మిమ్మల్ని ఆకాశానికి ఎత్తేసే వారు కాదా! స్వయంగా నడుం కట్టి, ఆ కళాఖండాన్ని ప్రదర్శించి వుండేవారు... కాదంటారా? వినయ నవ్వుతూ ప్రశ్నించింది.

ఆత్మారామ్ విడ్డూరంగా చూస్తున్నాడు.

''మీరు తుడిచి వేయాల్సింది ఈ చిత్రాన్ని కాదు... సంకుచితత్వంతో ఈర్ష్యతో, అహంకారంతో చూసే అసభ్య దృష్టిని!''

ఆత్మారామ్ ఆమెను మెప్పుగా చూశాడు. ఆవేశంతో అతని మొహం జేవురించింది. ''వినయా... నువ్వు సాధారణ స్త్రీవి కావు... ఆదిశక్తివి! నీ నిజాయితీ ముందు నా హృదయం, నా కళాపిపాసా మోకరిల్లు తున్నాయి''.

''ఈ పెయింటింగ్‌ని చెరిపివేయనని నాకు మాటివ్వండి మామయ్యా!'' అంది వినయ.

ఆత్మారామ్ కళ్ళు తుడుచుకున్నాడు. మాట్లాడకుండా ఆమె తల నిమిరాడు.

***

ఉదయం ఎనిమిది కావొచ్చింది. ఎందుకో వినయ ఇంకా కాఫీ తీసుకు రాలేదు.

ఆత్మారామ్ ఆలోచిస్తూ మెట్లు దిగి వంట గదివేపు నడిచాడు. వంట గది గుమ్మంలోంచి మెల్లగావస్తోంది వినయ, కాఫీ కప్పులతో. ద్వారబంధాన్ని పట్టుకుని ఆగింది. ఆయాసంతో రొప్పుతోంది. ఆరిపోయిన పెదవుల్ని నాలుకతో తడుపుకుంది. మొహం మీద చెమటలు కమ్ముతున్నాయి. జుట్టు కొద్దిగా రేగింది. ఆత్మారామ్ గబగబా ఆమె దగ్గరగా నడిచాడు. కాఫీ కప్పును తీసి పక్కనే వున్న బల్ల మీద పెట్టాడు.

''ఒంట్లో బాగోలేదమ్మా?'' అడిగాడు. గాబరాగా, వినయ బలహీనంగా అతని



## ధోనీ, అసిన్‌ల మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్?

క్రికెట్ స్టార్ ధోనీకి, బాలీవుడ్‌లో సినిమాలు ఏవీ లేక ప్రస్తుతం ఖాళీగా ఉన్న అసిన్‌లకు మధ్య సమ్‌థింగ్...సమ్‌థింగ్ ఏదో జరుగుతోందనీ బాలీవుడ్‌లో పుకార్లు జోరుగా షికారు చేస్తున్నాయి. అసలు సంగతేమిటంటే...

గత సంవత్సరం ఇద్దరూ కలిసి ఏవో రెండు కమర్షియల్ యాడ్స్ చేశారు. అప్పుడే వీరి మధ్య పరిచయం చిగురించింది. అది కాస్తా పెరిగి పెద్దదయి పువ్వులు, కాయలు కాసే స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో (ఐ.పి.ఎల్. మ్యాచ్‌లు సీరియస్‌గా జరుగుతున్న రోజుల్లో) ఓ రోజు ధోనీ అసిన్ ఇంట్లోకి వెడుతూ కొందరు సినీ జనాల కంట్లో పడ్డాడు. ధోనీ ఎందుకెళ్ళాడంటే... సెమీ ఫైనల్ మ్యాచ్ అసిన్‌తో కలిసి చూడటానికట! నిజమే కాబోలు అని సినీ జనాలు లైట్‌గా తీసుకున్నారట! ఆ తరువాత తిరిగి మళ్ళీ ధోనీ అసిన్ ఇంట్లో హాజరు! అక్కడ ఓ గంట అసిన్‌తో జాలీగా గడిపి వెళ్ళిపోయాడట! గతంలో అంటే క్రికెట్ వంక ఉంది. మరి ఈ సారి ఏ మ్యాచ్ జరగడంలేదు కదా? అంటే వీరిద్దరీ మధ్య ఏదో సమ్‌థింగ్... సమ్‌థింగ్ జరుగుతున్నట్లే కదా!

వైపు చూసింది. ఆమె కళ్ళల్లో విపరీతమైన బాధ, భయం కనిపిస్తున్నాయి. మెల్లిగా వొగరుస్తోంది. అప్రయత్నంగా ఆమె కుడి చెయ్యితో నడుమును పట్టుకుంది.

''ఎలాగో... వుంది. మామయ్యా'' అందామె నీరసంగా.

ఆత్మారామ్ మెల్లిగా నడిపించి ఆమెని సోఫాలో కూచోబెట్టాడు. తన భార్యకి మొదటిసారి నొప్పులు ప్రారంభమైన దృశ్యం అతనికి గుర్తొస్తోంది. గబగబా టెలిఫోను వైపు నడిచాడు. డాక్టర్‌కి అంతా వివరించి వెంటనే రమ్మన్నాడు. ఒకసారి వినయవైపు చూసి, కొడుకు గదివేపు నడిచాడు. మురారి మంచం మీద, అటు తిరిగి పడుకున్నాడు.

''బాబూ... మురారీ'' ఆత్మారామ్ పిలిచాడు. మురారి ఇటు తిరిగాడు. మాసిన గెడ్డం. ఎర్రటి కళ్ళు. తండ్రిని చూసి, మౌనంగా మంచం మీద కూర్చున్నాడు.

''అమ్మాయికి నొప్పులొచ్చినట్టున్నాయి..'' ఆత్మారామ్ చెప్పాడు. మురారి మాట్లాడలేదు. అదోవిధంగా చూస్తూ తండ్రిని దాటుకుని హాల్లోకి నడిచాడు.

''మిస్టర్ మురారీ... డెలివరీ కష్టం అయ్యేలా వుంది. ఆమెని వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి'' అంది మరో అరగంటలో వినయను పరీక్షించి ఇవతలికి వచ్చిన డా. సుధేష్ణ.

మురారి అర్థం కానట్టు చూశాడు.

''నా కారులో తీసుకెళ్దాం. వెనకసీట్లో ఆమెని జాగ్రత్తగా కూచో బెట్టుకోండి'' అందామె వినయ వున్న గదిలోకి దారితీస్తూ. మురారి మౌనంగా ఆమెను వెంబడించాడు.

***

వినయ మంచం మీద పడుకుంది. పక్కనే పొత్తిళ్ళలో పడుకున్న బాబు పెద్ద పెద్ద కళ్ళని మరింత పెద్దగా చేస్తూ, కిటికీలోంచి వచ్చే సూర్య కిరణాల్ని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. వినయ తలతిప్పి చూసింది. గోడవారగా వున్న మరో మంచం మీద కూచుని బాబుని చూస్తున్నాడు మురారి. వినయ చూపుల్ని గమనించి, తల పక్కకు తిప్పుకున్నాడు.

''ఏమండీ... ఇలా రండి'' పిలిచింది వినయ.

మురారి మెల్లిగా లేచి, అయిష్టంగా కదిలి మంచం వారగా నిలబడ్డాడు.

''ఇలా చూడండి...''

మురారి వినయవేపు చూశాడు. అతని కళ్ళు మునుపట్లా లేవు. వాటిలో ఏదో లోపించింది. వినయ చిరునవ్వు నవ్వింది. మురారి నవ్వలేదు. ఆమెను చూస్తూ వుండిపోయాడు. వినయ మొహం తెల్లగా పాలిపోయి ఉంది. ఒక్క రవ్వ సన్నబడిన ఆమెకు, బాలెంత అందం కొత్తరూపాన్ని ఇచ్చింది.

''బాబు అంతా మీ పోలికే. కళ్ళు మాత్రం నావి. ... కదూ?'' వినయ ప్రశ్నించింది.

''ఊఁ....''

వినయ విచారంతో అతన్నిచూసింది. మాట్లాడ్డం దాదాపు మరచి పోయాడతను.

''బాబు పుట్టాక జరిగిందాన్ని మీరు మర్చిపోతారనుకున్నాను'' అంది వినయ అతన్ని చూస్తూ.

మురారి తదేకంగా ఆమెని చూశాడు. అతని కళ్ళల్లోకి కాఠిన్యం వచ్చి చేరింది. రెప్పపాటులో. ''బాబు పుట్టాక కాదు... నేను బతికుండగా మరచి పోలేను!''

వినయ నిట్టూర్చింది. ఈ మధ్య తన భర్త కంఠాన్ని వినాలంటే ఆయిల్ పెయింటింగ్ గురించే మాట్లాడాలి. ఆ విషయం అయితే తప్ప అతను నోరు విప్పట్లేదు!

''ఎంత ప్రయత్నించినా విషయం పూర్తిగా చెప్పే అవకాశం ఇవ్వలేదు మీరు. మామగారికి... టెర్మినల్ కాన్సర్... ఆయన ఆట్టే రోజులు బతికే అవకాశం లేదు... అంచేత ఆయన చివరి కోరికను..''

''ఆయన జబ్బు గురించి నాకు తెలుసు! నువ్వు కొత్తగా చెప్పక్కర్లేదు. ఏనాడో డాక్టర్ చెప్పాడు. కాని, ఆ కారణం కూడా మీ చర్యను సమర్థించదు! మీరిద్దరూ కలిసి చేసినది హేయమైన పని!''

''అంతా తెలిసి... మీరు..''

''తను చచ్చిపోబోతున్నానని ముందుగా తెలుసుకున్న వ్యక్తికి పిచ్చిపిచ్చి ఆలోచనలొస్తాయి. మీ మామగారికి మతి భ్రమించింది. సరే! కానీ, నీ సంగతే... నీ సంగతే నాకు అర్థం కాలేదు. నువ్వు నన్ను వంచించావ్!'' మురారి ఆక్షేపణగా అన్నాడు.

''నేను మిమ్మల్ని మోసం చేయలేదు!'' వినయ ఉద్రేకంతో అంది.

''వినయా!'' మురారి గద్దించాడు.

''నేను నగ్నంగా నిలుచుంది నా మామగారి ముందుకాదు... ఒక కళాతపస్వి ముందు. నన్ను చూసింది ఒక మనిషి కళ్లు కాదు.. ఒక ఆర్టిస్టు కళ్ళు''.

కవిత
poem

# నువ్వురాయని నీ పాట



అలనాడెప్పుడో
ఓ ఉషోదయాన నన్ను నిద్రలేపి
ఒక కూనిరాగాన్ని బహూకరించేవు
అప్పుడనుకోలేదు సుమా
అదే ఓ సుమధుర రాగంగా
నా హృదయ కుహరంలో దాగుంటుందని
ఓ సాయంకాలపు నీరెండలో
కడలి ఒడ్డున కూర్చొని
అలలు లెక్క పెడుతున్న సమయాన నా చెవిలో ఏదో గుసగుసలాడేవు
అదొక అపురూప పల్లవిగా
రూపుదిద్దు కోగలదని నిజంగానే ఊహించాను
నీ మాటలే పాటలుగా చేయాలని
పదాలన్నీ పోగుచేసి
చరణాలుగా పేర్చుకుంటూంటే
ఆ రాగమే అకస్మాత్తుగా
పెదాలపై నాట్యం చేసింది
సరిగ్గా-
పాట పరిమళించే వేళకి
నువ్వు అకస్మాత్తుగా అదృశ్యమైపోయావు
రాగం కరిగి పదాలు చెదిరి పోయాయి
నేనొక్కడినే
రెక్కతెగిన పక్షిలా గిరికీలు కొట్టుకుంటూ
ఆ అసంపూర్ణ పాట కోసం
నీ ఉనికిని వదిలిన ప్రతిచోటా
రోజూ ఆర్తిగా ఎదురు చూస్తూనే ఉన్నాను
నాకు తెల్సు
ఎప్పుడో ఓ ప్రాతఃకాల వెలుగు కిరణంలానో
నిశ్శబ్దరాత్రి
దూరతీరాల నించి వినవచ్చే వేణుగానంగానో
పున్నాగ చెట్టు కొమ్మల మధ్య నుండి వినవచ్చే
జంట పక్షుల కువకువలు గానో
ఆ పాట
నా హృదయ కవాటాలను తాకి
నా మనసు పొరలను తడిపి
నన్నలరిస్తుందని...

–ఆదూరి వెంకట సీతారామమూర్తి
**94419 40653**

మురారి వెటకారంగా నవ్వాడు. ''కళాతపస్వి! అతనూ మనిషే! తనలో అజ్ఞాతంగా వున్న తుచ్ఛమైన వాంఛని ఆయన అట్లా తీర్చుకున్నాడు. నువ్వు ఫ్రాయిడ్‌ని చదవలేదు.

వినయ ఆవేశంతో లేచి కూర్చుంది. అతన్ని తీక్షణంగా చూసింది.

''మాట్లాడే మనుషులు ఎదురుగా ఉన్నప్పుడు మనస్తత్వశాస్త్రం చదవక్కరలేదు. మనుషుల్నీ, మనసుల్నీ చదివితే చాలు! మగవారి చూపుల్లోని అసలు అర్థాన్ని ఆడదే చదవగలదు. మామగారితో కలిసి మీరు పెళ్ళిచూపులకి వచ్చారు. అప్పుడు ఆయన చూపుల్లో తన కాబోయే కోడలి అందం పట్ల ఆరాధన కనిపించింది.

మీ చూపుల్లో కోరిక, కామం కనిపించాయి. ప్రత్యక్షంగా పైకి కనిపిస్తున్న అందాన్ని కాకుండా, దుస్తులు దాచిన అందాన్ని చూసే ప్రయత్నం చేశాయి మీ కళ్ళు! ఆనాడు మీ కళ్ళతో మీరు నన్ను రేప్ చేశారు! నన్ను చూసిన ప్రతిసారీ, నా దగ్గరగా వచ్చిన ప్రతిసారీ మీ చూపుల్లో కామం, స్వార్థం కనిపించాయి. మామ

గారి చూపుల్లో వాత్సల్యం, ఆరాధన తప్ప మరేం కనిపించలేదింత వరకూ'' వినయ గుక్క తిప్పుకోకుండా చెప్పుకు పోతోంది.

''వినయా!''

''కానుపు కష్టం అయినప్పుడు, నలుగురు మగ డాక్టర్లు మీ భార్యను నగ్నంగా గంటల తరబడి చూశారు. ఆమె శరీరాన్ని పరీక్షించారు..''

''అది వేరే సంగతి... ఆ పరిస్థితి వేరు'' మురారి అడ్డొస్తూ అన్నాడు.

వినయ చిన్నగా నవ్వింది. ''ఓహో... పరిస్థితులు వేరైతే, మీ భార్యకి ప్రాణం మీదికి వస్తే పరపురుషులు ఆమెని నగ్నంగా చూడొచ్చన్నమాట!''

''నువ్వు పేషెంటువి. వాళ్లు డాక్టర్లు. ఆ సమయంలో వాళ్ళ దృష్టి...'' మురారి తటాలున ఆగాడు. ఆశ్చర్యంగా వినయ వేపు చూశాడు.

వినయ చిన్నగా నవ్వింది. ''అదే నేను చెప్తోంది. దృష్టి వేరైనప్పుడు ఉద్దేశమే వేరైపో తుంది. మరణించే ముందు తన జీవితాశయానికి ఒక రూపం ఇవ్వాలనుకున్న మామ గారు, తమ అంతిమకోరిక తీర్చు కోవాలనుకున్న మామగారు మోడల్‌గా నిలబడే చూలాలికోసం గాలిస్తున్నారు. ఆ సంగతి తెలుసుకున్న నేను ఆయన్ని ప్రోత్సహించాను. మరొకరి భార్యని అడిగేముందు తన కొడుకు భార్యను అడగటం ఆయన విధి అన్నాను. ఆయన అస్సలు అంగీకరించలేదు. మీ సంగతి నాకన్నా ఆయనకే బాగా తెలుసు''

''వినయా!''

''చివరికి నన్ను అర్థం చేసుకుని బ్రష్ పట్టుకుని నిలబడ్డ ఆయన ముందు ఏ మాత్రం జంకూ గొంకూలేకుండా అద్దంలో నా ప్రతిబింబం ముందు నేను నిలబ డ్డట్టు నిర్వికారంగా నిలబడ్డాను. అలా నిలబడే శక్తి ఇచ్చింది నా త్యాగం కాదు... ఆయన దృష్టి! అలాగే నలుగురు పరపురుషులైన డాక్టర్ల ముందు నిస్సిగ్గుగా, నిర్వి కారంగా పాపాయిలా వెల్లకిలా పడుకున్నాను. మీ చూపులముందు. మీ చూపుల్లో ప్రతిఫలించే కోరిక ముందు ప్రతిసారీ సిగ్గుపడ్డాను! అందుకు నిజమైన కారణం మీ కళ్ళల్లో, మీ కోరికలో మంటలా మండుతూ కనిపించే స్వార్థం!''

''వినయా!''

''మీరు భద్రంగా దాచుకున్న 'కాండిడ్ ఫొటోగ్రఫీ' పుస్తకాల్లో మీకు కనిపించే రంగుల నగ్న సౌందర్యమంతా మరొకరి కూతురో, చెల్లెలో, కోడలో అయిన ఆడ దానిమీద మీకు తెలీదా?''

''వినయా!''


''చెప్పండి... కాదనగలరా?'' వినయ సూటిగా ప్రశ్నించింది. మురారి అయో మయంగా చూస్తున్నాడు.

''మరొక వ్యక్తి భార్య అయిన నిండుచూలాల్ని మామగారు పెయింట్ చేసి వుంటే మీరు ఇలాగే ఆయనతో ప్రవర్తించేవారా?''

మురారి తటాలున మంచంమీద, ఆమె దగ్గరగా కూలబడ్డాడు. మెల్లిగా వినయ భుజమ్మీద చెయ్యివేశాడు. నెల రోజుల తరవాత అతను ఆమె దగ్గరగా కూచోడం అదే మొదటిసారి. మురారి జాలిగొలిపే కళ్ళతో చూశాడు. లోపల అతను పడుతున్న వ్యథ అతని మొహం మీద అచ్చు గుద్దినట్టుగా అవుపిస్తోంది.

వినయ అతనివైపు చిరునవ్వుతో చూసింది. ఆమె కళ్లు నవ్వుతున్నాయి.

''నా పక్కలో పడుకున్న బాబు చూస్తున్నప్పుడు నేను గుడ్డలు మార్చు కోగ లను. రెండు కళ్లు నా నగ్నత్వాన్ని చూస్తున్నాయన్న ఆలోచనే రాదు నాకు. మామ గారి ముందూ మోడల్‌గా అదే మానసిక స్థితితో, అదే స్వచ్ఛంద హృదయంతో నించున్నాను...''




మురారి చెయ్యి సున్నితంగా ఆమె నోటిని మూసింది. ''ఇంక చెప్పకు వినయా! నిన్నూ, నాన్ననూ ఇంకా అర్థం చేసుకోకుంటే నేను మానవ సంఘంలో పనికి రాను! ఇంట్లోకి అడుగు పెట్టగానే కంటబడిన ఆ పెయింటింగ్‌ని చూడగానే నాకు మతిపోయింది. ఏవేవో వూహించుకున్నాను.. మనసు పాడయ్యింది. నీలా, నాన్నలా నేను అంత లోతులకు వెళ్ళి మనిషిని అర్థం చేసుకోలేక పోయాను. అంత పైకి ఎక్కలేక పోయాను. ఎర్రగా కాల్చి వదిలే బాణాల్లాంటి మాటలతో నిన్నూ, పాషాణం లాంటి మౌనంతో నాన్ననూ కష్టపెట్టాను. నన్ను క్షమించు వినయా!'' ఆమె నోటిని కప్పిన చేతిని తీసి మురారి ఆమెని దగ్గరగా లాక్కుని, బుగ్గమీద పెది మలతో రాశాడు. వెచ్చటి కన్నీళ్లు వినయ బుగ్గల్ని తాకాయి.

వినయ కన్నీళ్ళతో, ఆనందాశ్రువులతో భర్తని చూసింది. అతని కళ్ళలో తొణికిస లాడుతున్న అశ్రువుల్ని తుడిచింది. లేచి నిలబడి చిరునవ్వుతో చూసింది. ''మీ క్షమాపణలు మామగారికి చెప్పుకోండి. పదండి!'' అంది. కిందకి వంగి బాబుని చేతుల్లోకి తీసుకుని మేడమెట్లు వేపు అడుగు లేసింది. పక్కనే అడుగులేస్తున్న మురారి చెయ్యి ఆమె భుజాల్ని చుట్టింది.

***

''నాన్నా... నన్ను క్షమించు నాన్నా! సభ్యతకీ, అసభ్యతకీ తేడా కనుక్కోలేకో పోయాను'' మురారి మెల్లిగా అన్నాడు. మంచం మీద వెల్లకిలా పడుకున్న తండ్రిని చూస్తూ, ఆత్మారామ్ నమ్మలేనట్టు చూశాడు. వినయా, మురారీ నవ్వుతూ చూస్తున్నారు. ''నాకు వెల్తుర్ని చూపించినట్టే వినయ నీకూ వెల్తుర్ని చూపించిందా బాబూ!'' అన్నాడు గద్గద కంఠంతో. అతని కళ్ళు వత్తి ఎగబోసిన దీపాల్లా వెలుగు తున్నాయి. వినయ బాబుని అతని పక్కనే పడుకోబెట్టింది. ఆత్మారామ్ ప్రేమగా పాపడి తల నిమిరాడు. చిన్నారి అరచేతిని ముద్దెట్టుకున్నాడు. మెల్లిగా లేచి కూచు న్నాడు. నవ్వుతూ చూశాడు.

తనకి ఇరువైపులా వున్న కొడుకూ కోడళ్ళ భుజాల మీద రెండు చేతుల్ని వేసి నడిచాడు. అతని మొహంలో ఆనందం తాండవిస్తోంది. తన సృష్టి, తన సాహసం, తన చివరి కోరిక కొడుకూ కోడళ్ళని వేరు చేయలేదు!

పెయింటింగ్‌ని కప్పిన తెరని తొలగించాడు మురారి. అతని కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకుంటున్నాయి. ఇంతకాలం తనకి కనిపించని, తను చూడలేని సౌందర్యం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. వినయ మొహం వెలుగుతోంది. ఆత్మారామ్ మొహం అనంత సంతృప్తితో నిండి పోయి వుంది. అతను గర్వంగా మురారి వైపు చూశాడు.

''మురారీ! ఆర్టిస్టయిన నన్ను కూడా కప్పేసిన అసహజ ప్రవృత్తిని వినయ తన అమలిన దృక్పథంతో తొలగించింది. ఈ చిత్రంలోని ఘనత అంతా ఆమెదే'' అన్నాడు ఆత్మారామ్ ఉద్రేకంతో. వినయ వైపు కృతజ్ఞతతో చూస్తూ, అతనిలోంచి ఆనందం ఉప్పెనలా పొంగుతోంది. ఆయన వణికిపోతున్నాడు.

మురారి తండ్రిని పొదివి పట్టుకుని వెనక్కు తిప్పి మంచం వేపు నడిపించ బోయాడు. ఆత్మారామ్‌లో చలనం లేదు.

ఇద్దరూ పట్టుకుని, జాగర్తగా అతన్ని మోసుకెళ్ళి మంచంమీద పడుకో బెట్టారు. వినయ ఆత్రంగా అతని మొహంలోకి చూసింది. ఆత్మారామ్ మొహంలో ఏదో కొత్త ప్రశాంతత గంభీరంగా ప్రస్ఫుటమవుతోంది. అతని కళ్ళల్లో తొణికిన ఇందా కటి అశ్రువులు ఆరుతున్నాయి.

మురారి గాభరాగా ముందుకి వంగి తండ్రి ఛాతీమీద చెవి ఆనించాడు. పైకి లేచి నాడిని పరీక్షించాడు. వినయ ప్రేమగా ఆత్మారామ్ జుత్తుని నిమురుతోంది. మురారి ఆమెవైపు దీనంగా చూశాడు.

''వినయా... నాన్న వెళ్ళిపోయాడు'' అంటూ ఆత్మారామ్ శరీరం మీదకి వంగి, నిశ్శబ్దంగా రోదిస్తూ వుండిపోయాడు.

వినయ చెయ్యి అతని వీపుమీద పడింది. అతను లేచి కన్నీళ్ళతో ఆమెను చూశాడు. ఆమె కళ్ళలోంచి నీళ్ళు ఉబుకుతున్నాయి. పళ్ళతో కింది పెదవిని నొక్కి పట్టి ఏడుపుని ఆపుకునే ప్రయత్నం చేస్తోంది. కన్నీళ్ళు బుగ్గలమ్మట జారాయి.

ఇద్దరూ పక్కపక్కనే నిలబడి, బాబు వైపూ, ఆత్మారామ్‌వైపూ చూశారు. మన వడూ, తాతా ఇద్దరూ నిద్రపోతున్నారు. కానీ ఒకరిది మెలకువరాని దీర్ఘ సుషుప్తి!

బాబు మొహం మీద ప్రశాంతత నాట్యం చేస్తోంది. ఆత్మారామ్ మొహంలో అనంత శాంతి. మురారీ, వినయా అప్రయత్నంగా గోడకి వేళ్ళాడుతున్న 'ఉదయం', 'అస్తమయం' చిత్రాల్ని చూస్తూ వుండి పోయారు.

–విపుల మాసపత్రిక ఫిబ్రవరి *1986*